ప్రజాశక్తి
సోమవారం 14 జూలై 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ముంచెత్తిన వాన

కెఆర్ఎం.కాలనీలో నదిలా ప్రవహిస్తున్న వర్షపు నీరు

- కెఆర్ఎం.కాలనీలో కొట్టుకుపోయిన బైకులు
- పలు ప్రాంతాల్లో కార్లు, మోటారు వాహనాలు మునక
- జ్ఞానాపురంలో ఇళ్లలోకి మురుగునీరు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్

విశాఖ నగరంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో పిడుగులు పడ్డాయి. మధ్యాహ్నం 12 గంటల తరువాత వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. గాజువాక, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో మోస్తరు వర్షమే కురిసినా.. నగరాన్ని మాత్రం వాన ముంచెత్తింది. ఎంవిపి.కాలనీ, పెద వాల్తేరు, చిన వాల్తేరు, మద్దిలపాలెం, చైతన్యనగర్, సీతమ్మధార, హెచ్‌బి.కాలనీ, కెఆర్ఎం కాలనీలు నివాసాల్లోకి చేరాయి. ఇరుకుగా ఉండే కెఆర్ఎం కాలనీలో రోడ్డు వెంబడి పెద్ద నదిలా వర్షపు నీరు ప్రవహించింది. ఇళ్ల ముందు నిలిపి ఉంచిన కార్లు మునిగిపోయాయి. బైకులు కొట్టుకుపోతుండగా స్థానికులు వాటిని పట్టుకునేందుకు జోరువానలోనే పరుగులు తీశారు. పైన పేర్కొన్న కాలనీలన్నీ లోతట్టు ప్రాంతాలు. అక్కడి డ్రెయినేజీ సమస్యలపై ప్రజలు ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వానికి పట్టడం లేదు. దీంతో వానాకాలంలో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలమయమయ్యాయి. ఆయా ప్రాంతాల్లోని గెడ్డలు, కాలువలు ఉప్పొంగాయి. నీటి ప్రవాహానికి వ్యర్థాలు, చెత్తాచెదారం కొట్టుకువచ్చి ప్రజల జివిఎంసి 41వ వార్డు జ్ఞానాపురం ప్రాంతంలోని ఇళ్లలోకి మిగతా 2లో..

జ్ఞానాపురంలో ఇళ్ల మధ్యలోకి చేరిన నీరు

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

- ప్రయాణికులకు అధిక ప్రాధాన్యత
- వాల్తేరు డిఆర్ఎం లలిత్ బోప్రా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళ్తున్నట్టు వాల్తేరు డివిజినల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) లలిత్ బోప్రా తెలిపారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు, నూతన జోన్ పనుల పరిస్థితిని వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

వాల్తేర్ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలపండి ?

వాల్తేరు రైల్వే డివిజన్‌లో అమృత్ భారత్ పథకం కింద 12 రైల్వే స్టేషన్ల అభివృద్ధి, 4 రోడ్డు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జరుగుతున్నాయి. పార్వతీపురం, బొబ్బిలి రైల్వే స్టేషన్లలో ఆధునికీకరణ పనులు, 13 స్టేషన్లలో లిఫ్ట్‌ల ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించాం. కొత్తవలస-కిరండోల్, కొత్తవలస-రాయగడ మధ్య డబ్లింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద పొడవైన లిమిటెడ్ హైట్ సబ్‌వే నిర్మాణం పూర్తయ్యింది.

ప్రయాణికులకు ఏయే సౌకర్యాలు కల్పించారు ?

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం స్లీపింగ్ పాడ్స్ (క్యాప్సూల్ హోటల్స్)ను ప్రవేశ పెట్టాం. సింగాపూర్ రోడ్ జంక్షన్ (రాయగడ సమీపంలో) వద్ద 5.5 కిలోమీటర్ల పొడవైన ఫ్లైఓవర్ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఇది ట్రాఫిక్ రద్దీని తగ్గించి, రైళ్ల రాకపోకలను సులభతరం చేస్తుంది. పెందుర్తి - సింహాచలం నార్త్ స్టేషన్ల మధ్య కూడా ఫ్లైఓవర్ ప్రాజెక్టు మంజూరైంది. దువ్వాడ-సింహాచలం నార్త్ స్టేషన్ల మధ్య, అలాగే వడ్లపూడి గేట్ జంక్షన్ క్యాబిన్, గంగవరం పోర్ట్-విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మధ్య ట్రై లైన్‌తో సహా మూడవ, నాలుగవ లైన్ల నిర్మాణం చేపడుతున్నాం. పార్వతీపురం, బొబ్బిలి రైల్వే స్టేషన్లలో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. పలుచోట్ల మిగతా 2లో..

ట్రైబల్ సెల్‌తో మెరుగైన వైద్యసేవలు

వార్త 2లో..

ఒకే గదిలో రెండు తరగతులు

వార్త 3లో..

క్వారీ లీజులు రద్దు చేయకుంటే ఉద్యమం

వార్త 8లో..

వెంకటాపురంలో బిగించిన మీటర్లను పరిశీలిస్తున్న సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

స్మార్ట్ మీటర్లపై ఉద్యమం

వెంకటాపురంలో అధిక బిల్లుల మీటర్లు పరిశీలన

వార్త 5లో..

షీలానగర్‌లో భారీ చోరీ

ప్రజాశక్తి - గాజువాక : షీలానగర్‌లో ఆదివారం ఉదయం భారీ చోరీ జరిగింది. కిలో బంగారం, మూడు కిలోల వెండి, రూ.22 లక్షల నగదు, 11 వాచీలు, పట్టు చీరలను గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించినట్టు గాజువాక క్రైమ్ పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. ఎల్‌ఐసిలో పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావు షీలానగర్ సమీపంలోని వెంకటేశ్వర కాలనీలో లక్ష్మీ రెసిడెన్సీలో రెండో అంతస్తులో నివసిస్తున్నాడు. కుమార్తెకు పెళ్లి కుదరడంతో బ్యాంకులో ఉన్న వెండి, బంగారంతో పాటు నగదును కూడా ఇంటికి తీసుకువచ్చారు. పెళ్లి వేడుకను పురస్కరించుకుని ఇంటికి రంగులు, సున్నాలు వేస్తుండటంతో వాటి వాసన ఎక్కువైంది. దీంతో శనివారం రాత్రి ఇంటికి తాళాలు వేసి కింద సెల్లార్‌లో రాత్రి 11 గంటల తరువాత పడుకున్నారు. ఈ విషయాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు శ్రీనివాసరావు ఇంట్లోకి చొరబడ్డారు. అందినకాడికి దోచుకున్నారు. ఉదయం 5:30కి లేచి చూసేసరికి తలుపు, బీరువా పగలగొట్టి ఉండటంతో దొంగతనం జరిగినట్టు శ్రీనివాసరావు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు క్లూస్ టీంతో వచ్చి దర్యాప్తు ప్రారంభించారు.

నేటి నుంచి బిమ్‌స్టెక్ కాన్‌క్లేవ్

ఇప్పటికే విశాఖకు చేరుకున్న కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్, సభ్య దేశాల ప్రతినిధులు

మంత్రి సోనోవాల్‌కు స్వాగతం పలుకుతున్న అంగముత్తు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ : బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ-సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కో-ఆపరేషన్ (బిమ్‌స్టెక్) పరిధిలో ప్రాంతీయ నౌకాశ్రయ, సముద్ర సంబంధాల బలోపేతానికిగాను సోమ, మంగళవారాల్లో తలపెట్టిన బిమ్‌స్టెక్ పోర్ట్స్ కాన్‌క్లేవ్‌కు విశాఖ కేంద్రంగా అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఈ కార్యక్రమాన్ని కేంద్ర పోర్టులు, నౌకలు, జల రవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో ఆయన ఆదివారం సాయంత్రానికి విశాఖకు చేరుకున్నారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఛైర్మన్ ఎం.అంగముత్తు, కార్యదర్శి టి.వేణుగోపాల్, ఇతర అధికారులు సాదర స్వాగతం పలికారు. మరోపక్క బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయ్‌లాండ్ సహా బిమ్‌స్టెక్ సభ్యదేశాల ప్రతినిధులంతా విశాఖకు ఇప్పటికే చేరుకున్నారు. దేశంలోని అన్ని ప్రధాన పోర్టుల ఛైర్మన్లు, డిప్యూటీ ఛైర్మన్లు, సీనియర్ అధికారులు ఈ కాన్‌క్లేవ్‌లో పాల్గొనున్నారు. ఈ క్రమంలో విపిటి ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లూ చేశారు. కేంద్ర మంత్రి సోనోవాల్ విశాఖ పోర్టులో పలు అభివృద్ధి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ముంచెత్తిన వాన

వర్షపు నీరు చేరింది. ఎర్రిగడ్డ పొంగిపొర్లింది. మురుగు నీరు ఇళ్లలోకి చేరి ఆ ప్రాంతమంతా చెరువును తలపించిందని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఆవేదన వ్యక్తం చేశారు. నీట మునిగిన ప్రాంతాలను ఆదివారం ఆమె పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత జివిఎంసి సర్వసభ్య సమావేశంలో జ్ఞానాపురం ఎర్రగడ్డ సమస్యపై గళమెత్తినప్పటికీ కూటమికి చెందిన మేయర్ సరైన చర్యలు తీసుకోలేదన్నారు. గెడ్డ పూడికలు వేరు చేసి, మురికి నీరు ప్రవహించేలా టెండర్‌ను కొనసాగించలేదన్నారు. కార్పొరేటర్‌గా తాను ఈ సమస్యపై పోరాడుతున్నానన్నారు. 41వ వార్డు ఎర్రిగడ్డ టెండర్‌ను కొనసాగించి, డ్రైయినేజీలు, కాలువలు పొంగిపొర్లకుండా చూడాలని ఆమె డిమాండ్ చేశారు.

నేటి నుంచి బిమ్‌స్టెక్ కాన్‌క్లేవ్

కార్యక్రమాలను ప్రారంభించి, కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారని అధికారులు వెల్లడించారు. బిమ్‌స్టెక్ దేశాల ప్రముఖులు, ఆతిథ్య దేశమైన భారత్‌కు చెందిన నౌకాశ్రయ రంగ నిపుణులు తమ అనుభవాలను ఈ కాన్‌క్లేవ్‌లో పంచుకోనున్నారు. బిమ్‌స్టెక్ దేశాల మధ్య పోర్టు, మారిటైమ్ రంగాల్లో భాగస్వామ్యం మరింత బలోపేతమయ్యేందుకు, విశాఖపట్నం బే ఆఫ్ బెంగాల్ ప్రాంతంలో కీలక సముద్ర కేంద్రంగా ఎదిగేందుకు ఈ కాన్‌క్లేవ్ దోహదపడుతుందని పలువురు భావిస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నాం.

నూతన రైల్వే జోన్ పనుల పరిస్థితేంటి ?

విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. జోన్ ప్రధాన కార్యాలయ పనులు ప్రారంభమయ్యాయి. ముడసర్లోవ సమీపంలో 52.2 ఎకరాల స్థలంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దక్షిణ కోస్తా రైల్వే జోన్ తొలి జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథుర్‌ను ప్రభుత్వం నియమించింది. రెండేళ్లలో 11 అంతస్తుల ప్రధాన కార్యాలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అప్పటివరకు నగరంలోని అద్దె భవనం నుంచి జిఎం విధులు నిర్వహిస్తారు. అందుకుగాను ఇప్పటికే పలు ప్రాంతాలను పరిశీలించాం. త్వరలోనే జిఎం తన కార్యకలాపాలను ప్రారంభిస్తారు.

విశాఖపట్నం రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయి ?

విశాఖపట్నం రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులు కొన్ని అడ్డంకులను ఎదుర్కొన్నప్పటి వేగం పుంజుకోనున్నాయి. అక్టోబర్ నుండి పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి. 2027 మే నాటికి పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ముఖ్యంగా ప్లాట్ ఫారాల సంఖ్యను 8 నుండి 14కి పెంచనున్నాం. ప్రయాణికులకు విమానాశ్రయం లాంటి సౌకర్యాలు కల్పించనున్నాం. పునర్నిర్మాణ పనుల కోసం దాదాపు రూ. 500 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను మెట్రో రైల్‌తో అనుసంధానం చేస్తారా ?

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను మెట్రో రైలుతో అనుసంధానం చేయడానికి ప్రణాళికలు ఉన్నాయి. రైల్వే స్టేషన్‌కు, మెట్రో స్టేషన్‌కు మధ్య నిరంతరాయంగా కనెక్టివిటీని అందించడానికి 72 మీటర్ల ఎయిర్ కారిడార్‌ను నిర్మించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు పనులు త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

టికెటింగ్ వ్యవస్థను మెరుగుపరచడానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

అన్ని ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్, అన్‌రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ కౌంటర్లలో క్యూ ఆర్ కోడ్ ఆధారిత చెల్లింపులను ప్రవేశపెట్టాం. తద్వారా ప్రయాణికులు యుపిఐ యాప్‌లను ఉపయోగించి డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు. అన్‌రిజర్వ్‌డ్ టిక్కెట్ల కోసం మొబైల్ టికెట్ బుకింగ్‌ను ప్రోత్సహించడానికి యుటిఎస్ మొబైల్ యాప్ గురించి విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. టికెట్ కలెక్టర్‌లకు హ్యాండ్‌హెల్డ్ టెర్మినల్స్ అందించారు. దీనివల్ల రిజర్వేషన్ చార్ట్‌లు అవసరం లేకుండానే రిజర్వేషన్ స్థితిని తనిఖీ చేయవచ్చు. ఆన్‌లైన్‌లో జరిమానాలు వసూలు చేయవచ్చు.

వాల్తేరు డివిజన్‌లో ప్రయాణికుల భద్రతకు చేపట్టిన కార్యక్రమాల గురించి చెప్పండి ?

ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ట్రాక్, వంతెనలు, సిగ్నలింగ్ వ్యవస్థల పర్యవేక్షణ నిరంతరం జరుగుతోంది. నీరు పారే ప్రాంతాల్లో, ప్రమాదకర స్థలాల్లో పెట్రోలింగ్ కోసం వాచ్‌మ్యాన్‌లను నియమించాం.

ఫేస్‌బుక్‌లో జిల్లా కలెక్టర్ పేరుతో ఫేక్ అకౌంట్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఫేస్‌బుక్‌లో విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిరప్రసాద్ పేరుతో ఫేక్ అకౌంటును ఎవరో తెరిచారు. ఈ విషయాన్ని కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఫోటోతో,ఆయన పేరుతో ఫేక్ అకౌంట్ ను ఫేస్ బుక్‌లో పేర్కొన్నారని,దానిని ఎవ్వరూ నమ్మవద్దని తెలిపారు. ఇటువంటి తప్పుడు అకౌంట్లను ప్రజలు ఎవరూ అనుమతించవద్దన్నారు. ఫేక్ అకౌంటు క్రియేట్ చేసిన వ్యక్తిపై ఫిర్యాదు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఎగ్జిక్యూటివ్ పిహెచ్‌డి శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ఐఐఎంవి తన ఎగ్జిక్యూటివ్ పిహెచ్‌డి ప్రోగ్రామ్ రెండోబ్యాచ్‌ను ఆదివారం ప్రారంభించింది. ఈ ప్రోగ్రామ్‌లో అంతర్జాతీయ భాగంతో సహా బహుళ క్యాంపస్ ఇమ్మర్షన్‌లు ఉన్నాయి. ఈ కొత్త బ్యాచ్‌లో ఆటోమొబైల్, ఏవియేషన్, బ్రాడ్‌కాస్టింగ్, కన్సల్టింగ్, విద్య, ఇన్ఫర్మేషన్‌టెక్నాలజీ టెలికమ్యూనికేషన్స్ వంటి విభిన్న రంగాల నుండి 17 మంది సభ్యులు ఉన్నారు.

ట్రైబల్ సెల్‌తో మెరుగైన వైద్యసేవలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లోని ట్రైబల్‌సెల్‌లో మెరుగైన వైద్య సేవలు గిరిజనులకు అందుతున్నాయని, అల్లూరి సీతారామరాజు జిల్లా విశాఖ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు, కేజిహెచ్ ట్రైబల్‌సెల్ వైద్యాధికారి డాక్టర్ సంపత్ తెలిపారు. ఆదివారం కెజిహెచ్‌లోని ట్రైబల్‌సెల్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ విశ్వేశ్వరనాయుడు మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల పరిధి రిఫరల్ సేవల ద్వారా గిరిజన రోగులకు మెరుగైన వైద్యసహాయం అందించే దిశగా కెజిహెచ్‌లో చేర్పించి ప్రత్యేక వైద్యుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు,చికిత్సలు, ఆపరేషన్లు జరుపుతున్నామన్నారు. గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఐటిడిఎ పాడేరు పూర్వ ప్రాజెక్టు అధికారి నాగులపల్లి శ్రీకాంత్ ప్రత్యేక చొరవతో అప్పటి పాడేరు డివిజన్ పరిధి వైద్యాధికారులు డాక్టర్ టి. విశ్వేశ్వర నాయుడు, డాక్టర్ ఎఎస్ఎల్‌వి శాస్త్రి, డాక్టర్. సి.ఎం ప్రసాద్ ద్వార ప్రణాళికను సిద్ధం చేసి అప్పటి విశాఖపట్నం జిల్లా కలెక్టర్,కెజిహెచ్ సూపరింటెం డెంట్ సహకారంతో 2005జులైలో విశాఖపట్నం కెజిహెచ్ ఆవరణలో ట్రైబల్ సెల్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కెజిహెచ్ సూపరింటెండెంట్, ట్రైబల్‌సెల్ వైద్యాధికారితో బ్యాంకు జాయింట్ ఎకౌంట్ తీసుకొని తక్షణమే రూ.5 లక్షల నగదును అకౌంట్‌లో జమ చేయడం జరిగిందన్నారు . కెజిహెచ్‌లో వైద్య సేవలు పొందుతూ మరణించిన రోగులకు వారి స్వగ్రామానికి మృతదేహాలను తక్షణమే చేర్చేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 3 అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారని, ఇద్దరు డ్రైవర్లు విధుల్లో ఉంటారని తెలిపారు. మరొకరిని భర్తీ చేయాల్సి ఉందన్నారు. వైద్యాధికారులు,సిబ్బంది అన్నీ వేళల అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ప్రస్తుతం గిరిజన రిఫరల్ రోగుల వివరాలను రికార్డుల్లో నమోదుచేయడం జరుగుతున్నందున అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ఆధ్వర్యంలో ట్రైబల్‌సెల్‌ను ఆధునీకరణ జరుపుతూ రోగుల వివరాలు నమోదు కొరకు కంప్యూటర్, ఫర్నిచర్ మున్నగునవి సిబ్బందికి అందించనున్నట్లు తెలిపారు. కెజిహెచ్ ట్రైబల్‌సెల్‌కు వచ్చే గిరిజన రోగులు వైద్య సలహాల కోసం 6303921375 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

రామారావుకు సన్మానం

ప్రజాశక్తి - అనకాపల్లి : పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాలుగో వార్సికోత్సవ మహాసభలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జివిఎస్.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రాపర్తి వెంకటరావులు అనకాపల్లి జిల్లా బుచ్చియ్యపేట మండలంలోని పెదమదీన మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న బి.రామారావు మాస్టారిని ఘనంగా సన్మానించారు. రామారావు 41వ ఎపి స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ - 2024లో ప్రతిభ కనబిచారు. 200 మీటర్ల రన్నింగ్, 5కె వాకింగ్ ఈవెంట్స్‌లో బ్రాంజ్ మెడల్స్ సాధించారు. హర్యానాలో జరిగిన ఐదో నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా ఆయన్ని సన్మానించిన అనంతరం రామకృష్ణ, వెంకటరావు మాట్లాడుతూ రామారావు ఎంతో మందికి మార్గదర్శి అని కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆకుల విశ్వేశ్వరరావు, విశాఖ జిల్లా అధ్యక్షులు మోహన్ మురళి పాల్గొన్నారు.

రామారావును సన్మానిస్తున్న నాయకులు

మృత శిశువుకు రెడ్‌క్రాస్ అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ: ఒక మృత శిశువుకు రెడ్‌క్రాస్ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ నెల 10వ తేదీన మద్దిలపాలెం బస్‌డిపో వెనుక చెట్ల మధ్య ఓ నవజాత శిశువును గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసిన విషయం తెల్సిందే. సమాచారం అందుకున్న ఎంవిపి పోలీసులు దొండపర్తి-1 సచివాలయ విఆర్‌ఓ కృష్ణ చైతన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. నవజాత శిశువును కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందజేశారు. విఆర్‌ఓ ఇచ్చిన నివేదిక ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన బిడ్డను 6 అడుగుల ఎత్తున్న గోడపై నుంచి పడేశారని ప్రాథమికంగా తేల్చినట్టు తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టిలపై అంతులేని వివక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వంలో ఎవరు ఉన్నప్పటికీ, పాలకులు ఎవరైనప్పటికీ ఎస్‌సి, ఎస్‌టిల పట్ల వివక్ష కొనసాగుతోందని భీమసేన వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.రవిసిద్ధార్థ అన్నారు. ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద భీమసేన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, యువతకు ప్రత్యేక రుణమేళా నిర్వహించాలని, ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రుణాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన 5వ అదనపు జిల్లా జడ్జి మరియు మోటారు వాహన ప్రమాద పరిహార ట్రిబ్యునల్, విజయనగరం

MOP 90/2025

Between :
బంగరాల సన్యాసిరావు .....పిటిషనరు
And :
ధర్మపాల్ మరియు ఇతరులు .....రెస్పాండెంట్లు

నోటీసు

To
రెస్పాండెంట్ నెంబరు: 2
తాడి రాజేశ్వరి, భర్త: మజ్జి నారాయణరావు, హిందూ, వయస్సు సుమారు 34 సం॥రాలు, వానరు ఆఫ్ ది క్రైమ్ వెహికల్ నెం : AP 31EK 9444, నివాసం D.No. 13-10-2/2, బానోజీ కాలనీ, B.C.Road, కొత్తగాజువాక, విశాఖపట్నం జిల్లా -530026.

యిందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా పై కేసులో 2వ రెస్పాండెంట్ అయిన మీరు మీ హాజరు నిమిత్తం **తేది 31-7-2025**న వాయిదా వేసియున్నారు. కావున యీ ప్రకటన నోటీసుగా భావించి పై తేదీన పై కోర్టువారి ఎదుట **ఉదయం గం॥ 10-30 ని॥ల**కు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ వాదన చేసుకొనవలెను. లేనిచో పై కేసులో మీ వాదన లేవని భావించి మిమ్ములను Ex Party గా తీర్మానించెదురు.

కొసన సింహాచలం
అడ్వకేట్, విజయనగరం
సెల్ : 9490107072

మహారాజశ్రీ ముమ్మిడివరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S. No. 31/2025

Between:
మోర్త పద్మావతి & అనదర్ -వాద్లు
AND
మోర్త విజయలక్ష్మి, వగైరా -ప్రతివాద్లు
To:
D-6: మోర్త వెంకటరత్నం, W/o. లేటు పద్మనాభం, డో.నెం. 36-90-60, దేవేంద్రనగర్, కంచరపాలెం, విశాఖపట్నం.

D-7: ఆదివారపు గంగాభవాని, W/o. వెంకటేశ్వరరావు, ఫ్లాట్ నెం. 204, దేవేంద్రనగర్, కంచరపాలెం, విశాఖపట్నం.

D-8: మోర్త విప్లవ జ్యోతి, W/o. వెంకటరమణ, డో.నెం. 31-35/1, మహారాణిపేట, విశాఖపట్నం.

ఈ పై నెంబరు దావాను వాద్లు మీపై రిజిష్ట్రీ పార్టిషన్ Doct. No. 2298/2024, Void Document గా Declare చేయమని ఇంజెక్షన్ ఉత్తర్వులు ఇప్పించమని మున్నగు పరిహారములు కోరుచూ దావా దాఖలు చేసియున్నారు. దావాతో పాటుగా I.A. No. 184/2025 పిటీషన్‌ను టెంపరరీ ఇంజెక్షన్ ఉత్తర్వులు నిమిత్తం కోరుచూ మిమ్మల్ని 6 టు 8 రెస్పాండెంట్స్‌గా పేర్కొనబడినది. సదరు దావా మరియు పిటిషన్ వాయిదా **ది. 18-07-2025వ తేదీ అయివున్నది. వాయిదా రోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారు ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెనన్నీ, అట్లు కాని యెడల మీ పరోక్షమందున తీర్మానింపబడునన్నీ యిందు మూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
శ్రీ గుత్తుల శ్రీనివాసరావు
కుమారి మట్ట రమ్య
అడ్వకేట్స్, ముమ్మిడివరం
ముమ్మిడివరం సెల్: 9440041751
ది.13-7-2025 9440528135

IN THE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE, KAKINADA

A.S.No.230 / 2019

Between:
Baki Srinivasa Rao
...Appellant/Plaintiff
and
1) Baki Adilakshmi (died)
2) Baki Narasimha Murthy
3) Dupana Kanaka Ratnam
4) Byreddi Chitti Laxmi
...Respondents/Defendants

To: R3: Dupana Kanaka Ratnam,
W/o. Venkata Ramana, Hindu, Housewife, D.No.4-14, Kovvada, Kakinada Rural.
R4: Byreddi Chitti Laxmi,
W/o. Byreddi Apparao, Hindu, Housewife, D.No.21-50-9, Pedagantyada, Gajuwaka, Visakhapatnam District.

పై నెంబరు అప్పీలు దావాలో 3వ మరియు 4వ రెస్పాండెంట్స్ అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.**21-07-2025** తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం **10.30** ని॥లకు మీరు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై అప్పీలు దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

బోయనపల్లి రాధాకృష్ణ
A.అనిల్‌కుమార్ రాజా
అడ్వకేట్స్, డో.నెం.6-1-9, జవహార్ వీధి కాకినాడ, కాకినాడ జిల్లా, సెల్: 9440323951

In the Court of the Hon'ble Junior Civil Judge at Prathipadu

O.S. No. 159/2024

Between:
Peyyala Nookaraju ***...Plaintiff***
AND
Talluri Subbalakshmi
...Defendant

To:
Talluri Subba Lakshmi, W/o. (late) Lovaraju, aged 38 years, House wife, resident of Door No. 17-41/1, Muslim Street, Payakaraopeta Village, Payakaraopeta Mandal, Anakapalli Dist.,

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 17-7-2025వ తేదీ గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.సూర్యప్రకాశరావు, అడ్వకేట్
ప్రత్తిపాడు, సెల్: 8328346942

NOTICE UNDER ORDER 21 RULE 64 OF CPC
IN THE HONOURABLE COURT OF THE III ADDITIONAL DISTRICT JUDGE CUM FAMILY COURT AT VIZIANAGARAM

EP 144/2024 in 222/2022

Between:
M/s. Shriram Finance Limited., Usodaya Junction, MVP Colony, Visakhapatnam rep., by its G.P.A Holder, Mr. Vaddadi Vijaya, **...DHr**
And:
1) Bojja Lakshmi Prasad
2) N. Naveena Lakshmi **...JDrs**

NOTICE TO 1ST JDR

Bojja Lakshmi Prasad, S/o Appa Rao, D.No 9-11-8/23, Sivajipalem, L.B Colony, Visakhapatnam District

Whereas you have failed to satisfy an Award passed against you in A.A.222/2022, in favor of the Dhr and the DHr filed the above Execution Petition for Execution of the Award praying the Honourable court to order for attachment of the EP schedule property as per the provisions under Order 21 rule 54 there by sale of the property under the provisions of CPC to satisfy the EP amount of Rs.15,37,001/-

Whereas it is ordered by the Honourable Court that notice under Order 21 rule 64 of CPC by way of this Publication Notice since you are avoiding to take notice through Court and Registered Post. Therefore, it is ordered that you should attend to the Honouable III Additional District Judge Court Cum Family Court on **01-08-2025 at 10.30 AM** before the Court, in person or through your Advocate failing which the matter would be decided in your absence by setting you exparte.

MATURU SRINIVAS RAO, ADVOCATE,
Flat No: 201, Subhadra Apts, Kothagraharam, 1st Lane, Vizianagaram District, **Mobile: 9490898234**

ఒకే గదిలో రెండు తరగతులు

- ఆసక్తి చూపని విద్యార్థులు
- జెడ్‌పి హైస్కూల్‌లోనే కొనసాగుతున్న ఇంటర్ విద్య
- ఇదీ ఆనందపురం కళాశాల దుస్థితి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2019లో ప్రారంభమైన ఇంటర్మీడియట్ కళాశాలలో తగిన మౌలిక వసతులు లేకపోవడంతో కాలేజీలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడంలేదు. హైస్కూల్ పైఅంతస్తులో కేవలం రెండు గదులు ఇంటర్ విద్య కోసం కేటాయించారు. ఆ గదులలోనే ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి వంటి జనరల్ కోర్సులతో పాటు ఎంఎల్‌టి, ఎఇటి వంటి వొకేషనల్ కోర్సులను కూడా నడుపుతున్నారు. సరైన తరగతి గదులు, బ్లాక్‌బోర్డులు, కంప్యూటర్లు, స్టేషనరీ, తాగునీటి సదుపాయాలు లేని పరిస్థితుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరంగా మారింది.

ఈ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన 230 మంది విద్యార్థులలో ఒక్కరు కూడా ఈ కాలేజీలో అడుగుపెట్టకపోవడం పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం మొదటి సంవత్సరంలో ఎంపిసి 9, సిఇసి 17, బైపిసి 7 మంది మాత్రమే చేరారు. ఒకే తరగతి గదిలో రెండు కోర్సులను ఒకేసారి చెప్పడంతో విద్యార్థులకు గందరగోళంగా ఉంటుంది. తరగతి గదులు లేక ఇలా చెప్పవలసి వస్తుందని అధ్యాపకులు చెబుతున్నారు.

కళాశాలలో మంచినీటి సదుపాయం లేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరగతి గదులను విద్యార్థులు, అధ్యాపకులే శుభ్రపరుచుకోవాల్సిన దుస్థితి ఉంది. కాలేజీకి శాశ్వత ప్రిన్సిపల్ కూడా లేరు. మధురవాడ కాలేజీ ప్రిన్సిపల్ కృష్ణవేణి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కళాశాలలో మౌలిక వసతులపై కృష్ణవేణిను వివరణ కోరగా సమాధానం దాటవేశారు.

ఆనందపురం హైస్కూల్లో ఉన్న ఇంటర్ కళాశాల

ఒకే గదిలో రెండు తరగతులకు బోధిస్తున్న అధ్యాపకులు

ఇంటర్ విద్యకు తగిన మౌలిక వసతులు కల్పించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

సిపిఎం కార్యకర్త మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని మూలకుద్దు గ్రామానికి చెందిన సిపిఎం కార్యకర్త ఎరుసు చిట్టిబాబు (60) తీవ్ర అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. సిపిఎం జోన్ కార్యదర్శి ఆర్ ఎన్ ఎన్ . మూర్తి, నాయకులు రవ్వ నరసింగరావు, కర్రి రాము, డి.బాబాజీ తదితరులు చిట్టిబాబు భౌతిక కాయాన్ని ఆదివారం సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రజా, కార్మిక సమస్యలపై సిపిఎం, సిఐటియు నిర్వహించిన పలు పోరాటాలు, ఆందోళనల్లో చురుగ్గా పాల్గొనేవారని మూర్తి అన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఎరుసు చిట్టిబాబు

పిఎసిఎస్ చైర్మన్‌గా ఎల్లయ్య

ప్రజాశక్తి- తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా మండలంలోని సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన గుడ్డాల ఎల్లయ్య నియమితులయ్యారు. పర్సన్లుగా కాగితాల రమణ, కాళ్ల సత్యనారాయణను ప్రభుత్వం నియమించింది. ఇందుకు గాను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వీరంతా కృతజ్ఞతలు తెలిపారు. వీరి నియామకం పట్ల జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, సర్పంచ్ జివి.నారాయణ, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ గాడు తాతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం నియమితులైన వీరు 6 నెలల పాటు బాధ్యతలు నిర్వర్తిస్తారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామం జాతరలో నిర్వహించే వారంతపు సాంస్కృతిక కార్యక్రామాల్లో భాగంగా ఆదివారం చేపట్టిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీ సిద్యంద్ర యోగి నాట్యాలయం చిన్నారులచే కోలాటం, జానపద నృత్యాలు ప్రదర్శించారు. ముందుగా బుజ్జి బుజ్జి గణపయ్య, భావములోన, జాతిశ్వరం, ముకుంద ముకుంద, ప్రాణావాలయం, అరుకు ధింసా తదితర నృత్యాలకు ఆకాంక్ష, మౌనిక, ప్రజ్ఞ, చిన్నారి, రాజి, సంజన, మనవిత, నవ్య నత్య ప్రదర్శన ఇచ్చారు. మోహన్ లక్ష్మి నృత్య దర్శకత్వం వహించారు. పరిపాలనాధికారి రమేష్ రెడ్డి పర్యవేక్షించారు.

కూటమి పాలనపై వ్యతిరేకత : అమర్‌నాథ్

ప్రజాశక్తి-మధురవాడ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఎండాడ న్యాయ కళాశాల సమీపంలో ఉన్న వైసిపి కార్యాలయంలో భీమిలి వైసిపి ఇన్‌ఛార్జి ఆధ్వర్యాన భీమిలి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ, పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రం మొత్తం బాబు ష్యూరిటి -మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వేలల్లో జనం వస్తున్నారని తెలిపారు. ఇప్పటి నుంచి ప్రతి కార్యకర్తా కష్టపడి పనిచేస్తే 2029లో మన విజయాన్ని ఆపడం ఎవరి తరం కాదన్నారు.

భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి చిన్న శ్రీను మాట్లాడుతూ, 2024లో ఎన్నికల్లో వైసిపి ఓడిపోయినా కార్యకర్తలకు కొదవ లేదన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తనూ ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తైనాల విజయకుమార్, నాయకులు కెకె.రాజు, భీమిలి నియోజకవర్గం ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న అమర్‌నాథ్ తదితరులు

టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం దబ్బందలోని టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్ డిమాండ్‌చేశారు. టిడ్కో వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన దబ్బందలోని టిడ్కో ఇళ్ల వద్ద జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రెహమాన్ హాజరై మాట్లాడుతూ, దబ్బందలో టిడ్కో గృహాలు 40 బ్లాక్‌లో మొత్తం 1920 ఉన్నాయని, ఈ ఇళ్లను లబ్ధిదారులకు అలాట్ చేసినప్పటికీ, ఇప్పటికీ మౌలిక సదుపాయాలు కల్పించలేదని తెలిపారు. నగరానికి దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతానికి సరైన బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల నివాసితులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రోజువారీ అవసరాల కోసం కనీసం 3 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. 2022లో ప్రభుత్వం బ్యాంకు రుణాలు ఇప్పించి 2024 వరకు చెల్లించనక్కర్లేదని చెప్పి, ఇప్పుడు బ్యాంకులు వాయిదాలు వసూలు చేస్తుండడం దారుణమన్నారు. రుణాలు చెల్లించకపోతే ఇళ్లు స్వాధీనం చేసుకుంటామంటూ బెదిరిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రుణాలు రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినా ఇప్పటివరకు ఆ విషయంపై చర్యలు తీసుకోలేదని తెలిపారు. టిడ్కో ఇళ్లకు తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని, బ్యాంకు రుణాలను రద్దు చేయాలని, మంచినీరు, వీధి లైట్లు, బస్సు సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు పి.భానుప్రదీప్, పి.ఈశ్వరరావు, ఎన్.గోవింద్, సిహెచ్.రమణమ్మ, కె.నారాయణరావు, సిహెచ్.నూకరత్నం, ఎస్.జయశ్రీ, డి.దివ్య, సిపిఐ నాయకులు కె.లక్ష్మణరావు, సిహెచ్.కాసుబాబు, కె.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి -తగరపువలస : ఇప్పటి నుంచే పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి విద్యార్థులకు సూచించారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ శిక్షణా తరగతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు బోధిస్తారని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షులు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. ఆరిలోవ పెదగదిలి ప్రాంతానికి చెందిన మల్లీశ్వరి, ఆమె అల్లుడు కంచుమూర్తి మధుబాబు ఆరోగ్య సమస్యల నిమిత్తం ద్వారకా నగర్‌లోని ఓ ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి వస్తుండగా హనుమంతవాక మార్గంలోని మెడికవర్ హాస్పిటల్ సమీపంలో రాంగ్ రూట్‌లో వచ్చిన వ్యక్తి తన ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. దీంతో మల్లీశ్వరి, మధుబాబు కిందపడిపోయారు. అదే సమయంలో వెంకోజీపాలెం నుంచి అతివేగంగా వస్తున్న ఐచర్ వాహనం మల్లీశ్వరి పై నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఐచర్ వాహన డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలిపెట్టి పరారయ్యాడు. మధుబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బొలెరో ఢీకొట్టి బైకిస్ట్‌కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-వడ్డాది : ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని బొలేరో ఢీకొట్టిన ఘటనలో బైకిస్ట్‌కు తీవ్రగాయాలైన ఘటన ఆదివారం బుచ్చయ్యపేట మండలం వడ్డాది హైస్కూల్ వద్ద చోటుచేసుకుంది. వివరాలివి. వడ్డాది నుంచి కొండెంపూడి వెళుతున్న బొలెరో వాహనం హైస్కూల్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి పక్కనున్న షాపులోకి దూసుకుపోయింది. ఈప్రమాదంలో షాప్ వద్ద ఆగి ఉన్న బైక్‌పై కూర్చున్న సిహెచ్ లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి క్షతగాత్రుడుని అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం సెలవు రోజు, మధ్యాహ్నం సమయం కావడంతో హైస్కూల్ జంక్షన్‌లో పెద్దగా జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

2 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి- కె కోటపాడు: వ్యానులో అక్రమంగా తరలిస్తున్న రెండు టన్నుల రేషన్‌బియ్యాన్ని కె.కోటపాడు పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం స్థానిక ఎస్ఐ ఆర్.ధనుంజయ తెలిపిన వివరాలివి. స్థానిక పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా, శనివారం రాత్రి పది గంటల సమయంలో ఎపి 31టిపి 4752 నెంబరు గల వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో రెండు టన్నుల రేషన్‌బియ్యం పట్టుబడ్డాయన్నారు. మండలంలో గుల్లిపల్లి గ్రామంలో కార్డుదారుల నుంచి కొనుగోలు చేసిన రేషన్‌బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు.ఘటనలో వ్యాన్ డ్రైవర్ బూరా నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్నామని, బియ్యంతో వ్యాన్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయ తెలిపారు.

బెల్ట్ షాపుపై పోలీసుల దాడి

31 మద్యం బాటిళ్లు సీజ్

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో బుచ్చి రాజుపేటలో బెల్ట్ షాపుపై దాడి చేసి 31 మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బుచ్చి రాజుపేట గ్రామానికి చెందిన ధూళి అనంతరావు పాన్ షాప్ నిర్వహిస్తూ, మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నారని, దాడి చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

వైసిపి తూర్పు మహిళా అధ్యక్షులుగా శిరీష

ప్రజాశక్తి - ఆరిలోవ : తూర్పు నియోజకవర్గం వైసిపి మహిళా అధ్యక్షులుగా సీనియర్ నాయకులు కారైకాట్ శిరీష నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ పార్టీకి చేసిన కృషిని గుర్తించి, తనకు పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి కురసాల కన్నబాబు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, నాయకులు గొలగాని శ్రీనివాస్, వైసిపి నగర మహిళా అధ్యక్షులు పేడాడ రమణి కుమారి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో విఎంఆర్‌డిఎ నిధులతో తయారవుతున్న కన్వెన్షన్ సెంటర్‌కు విఎంఆర్‌డిఎ నిధులు రూ.19 లక్షలతోచేపట్టిన తారురోడ్డు పనులను వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆదివారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. ఈ కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ అధికారులు, కూటమి నాయకులు అయిత ఎర్రిబాబు, అప్పికొండ రాంబాబు, గంట్ల నర్సింహమూర్తి, ప్రభాకర్, కంచిబోయిన వెంకట సంతోష్, పిడివి.ప్రసాద్, గోపాల్, భాగ్యలక్ష్మి, రామలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మండల కుటుంబానికి అన్నంరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 94వ వార్డు పరిధి పురుషోత్తపురంలో వైసిపి సోషల్ మీడియా కార్యకర్త మండల బాల మురళి తండ్రి తాతబాబు మృతిచెందడంతో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. తాతబాబు భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చందయాదవ్, ఆబోతు శ్రీను, యలమంచిలి శ్రీను, రఘు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలంలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి-వేపగుంట : సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లో తాగునీరు, బిస్కెట్లు పంపిణీ చేశారు. దర్శనాలు తాత్కాలికంగా నిలిపిన సమయంలో భక్తులకు వినోదాన్ని కలిగించేందుకు రాజగోపురం సమీపంలోని కళామందిరంలో భరతనాట్యం నృత్య ప్రదర్శన నిర్వహించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 65వ వార్డు పరిధి ప్రియదర్శిని కాలనీలో రూ.5 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు సమక్షంలో మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో అందించినప్పుడే ఆశించిన ప్రగతి సాధ్యపడుతుందన్నారు. ఈ ప్రాంతంలో దీర్ఘకాలిక సమస్యలైన ఇళ్ల పట్టాల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. తన పదవీ కాలంలో ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కూటమి నాయకులు నిత్యం ప్రజల్లోకి వెళ్లి సమస్యలనడిగి తెలుసుకుని తన దృష్టికి తేవాలని సూచించారు. మౌలిక సదుపాయాలతో వార్డు రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాస్, నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు రట్టి వాసు, నాయకులు కృష్ణ, రెయ్యి రత్నం, స్వరూపారాణి, సుజాత, జగదీష్, మంగ, ఉమ, రాజు, రంజిత్ పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే దళితులకు విముక్తి

ప్రజాశక్తి-సీతమ్మధార : అణచివేత, దాడులకు నిరంతరం గురవుతున్న దళితులకు రాజ్యాధికారంతోనే విముక్తి సాధ్యమని కారంచేడు ఉద్యమ నేత సిర్రా నేతాజీ భగత్ సింగ్ తెలిపారు. పౌర గ్రంథాలయంలో భీమ్ సేన వార్ ఆధ్వర్యాన 'కారంచేడు నరమేధానికి 40ఏళ్లు' అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. సదస్సులో ముందుగా బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం భగత్‌సింగ్ మాట్లాడుతూ, దళితులపై హంతక దాడులు కారంచేడుతో ఆగలేదని ఆ పరంపర ఇప్పటికీ కొనసాగుతూనే ఉందని తెలిపారు. మనువాదం వల్ల కులహత్యాకాండలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దాన్ని రక్షించుకోవడానికి బహుజనులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. దళిత మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకతోటి బాబూరావు మాట్లాడుతూ, కారంచేడులో అగ్రకుల దురహంకారులు వేటాడి చంపిన తీరు వివరించారు. దాడికి గురైన బాధితురాలు దుడ్డు సులోచన మాట్లాడుతూ ఓటు వేయలేదని, ఆత్మగౌరవంతో బతుకుతున్నామని దళితులపై దుర్మార్గమైన దాడికి దిగారని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్‌పర్సన్ సీతా మహాలక్ష్మి, భీమ్‌సేన వార్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బూసి వెంకటరావు, బొడ్డు కల్యాణరావు, ప్రొఫెసర్ కోటిజాన్, టి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎపిఐఐసి స్థలం కబ్జా

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు రహదారికి ఆనుకొని ఉన్న ఎపిఐఐసి స్థలం కబ్జాకు గురైంది. విలువైన స్థలం కబ్జా చేసి దర్జాగా నెలవారి అద్దెలు వసూలు చేస్తున్నప్పటికీ సంబంధిత వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తుంది. గంగవరం పోర్టు రోడ్డుకు ఆనుకొని ఉన్న ఎపిఐఐసి స్థలాన్ని బలగ రామారావు వేరే సర్వే నెంబరు 310/17 వేసి దస్తావేజు 1310 నెంబర్‌తో 800 గజాల స్థలం కబ్జా చేశారు. దీనిపై దేనిశెట్టి చిన్నారి ఫిర్యాదు చేశారు. గాజువాక తహశీల్దార్ కార్యాలయం నుండి సర్వేయర్ వచ్చి కణితి గ్రామం సర్వేనెంబర్ 316/1బిగా గుర్తించారు. ఆ భూమి ఎపిఐఐసికి ల్యాండ్ ఎక్విజేషన్ జరిగినట్లు సర్వేయర్ తన నివేదికలో పేర్కొన్నారు. ఇదే విషయాన్ని చిన్నారావు చేసిన ఫిర్యాదుకు సమాధానంగా చెప్పారు. అయినా కబ్జాదారునికి ఎపిఐఐసి ఎలాంటి నోటీసులూ జారీ చేయలేదు. ఆ స్థలంలో షెడ్డులు నిర్మించి దర్జాగా నెలవారి అద్దెలు వసూలు చేస్తున్నారు. గాజువాకలో భూముల ధరలు పెరగడంతో ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ కబ్జాకు పాల్పడి లక్షలాది రూపాయలకు అమ్ముకుంటున్నారు. పేదలు చిన్న గుడిసె వేస్తే

కబ్జాకు పాల్పడిన స్థలంలో షెడ్లు

మాత్రం ప్రభుత్వ అధికారులు ఆఘమేఘాల మీద వాలిపోయి చర్యలు తీసుకుంటున్నారు. పెద్ద కబ్జాదారులపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం శోచనీయం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కబ్జాకు గురైన స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కబ్జాపై బలగ రామారావును ప్రజాశక్తి వివరణ కోరగా, సర్వే నెంబరు మార్పి రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయం వాస్తవమే అయినప్పటికీ, ఆ స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఎందుకు సర్వే నెంబరు మార్పి రిజిస్ట్రేషన్ చేశారని వివరణ కోరగా దానికి సమాధానం దాటవేశారు. గాజువాక తహశీల్దార్ శ్రీనివాసరావును వివరణ కోరగా ఆ స్థలం ఎక్విజేషన్‌లో ఎపిఐఐసికి బదలాయించినట్లు తెలిపారు.

ఘనంగా 'మహారాజా' బ్యాంకు మహాజన సభ

మహాజన సభలో మాట్లాడుతున్న రామకృష్ణంరాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : ది మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ 25వ మహాజన సభ ఆదివారం సీతమ్మధారలోనిక్షత్రియ కళ్యాణ మండపంలో నిర్వహించారు. సభలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.రామకృష్ణంరాజు మాట్లాడుతూ, ఈ ఏడాది మార్చి 31 నాటికి బ్యాంకు రూ.290.39 కోట్లు డిపాజిట్లు, రూ.202.16 కోట్ల రుణాలిచ్చిందని, మొత్తం రూ.492.55 కోట్లు వ్యాపారం కలిగి ఉందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరములో రూ.4.36 కోట్ల స్థూల ఆదాయాన్ని ఆర్జించగా రూ.1.13 కోట్లు ఆదాయపు పన్ను చెల్లించి, రూ.3.23 కోట్లు నికర ఆదాయం ఆర్జించినట్లు వివరించారు. బ్యాంక్ మూలధనం రూ.15.88 కోట్లు, రిజర్వ్, ప్రొవిజన్లు కలిపి రూ17.29 కోట్లతో నికర విలువ రూ.30.79 కోట్లుగా ఉందని పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సభ్యుల హర్షామోదంతో వాటాదారులకు 14 శాతం డివిడెండును ప్రకటించినట్లు తెలిపారు. మార్చి 31, 2026 నాటికి రూ.550 కోట్లు వ్యాపారం చేయటానికి లక్ష్యంగా నిర్ణయించుకున్నామని చెప్పారు. ఈ ఏడాది జులై 10వ తేదీ నాటికి బ్యాంకు రూ.315 కోట్లు డిపాజిట్లు, రూ.205 కోట్ల రుణాలిచ్చి మొత్తం రూ.520 కోట్లు వ్యాపారం కలిగి ఉన్నామని వివరించారు. ఈ మహాసభలో ప్రత్యేకంగా సభ్యులతో స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుగా మార్పు చెందాల్సిన ఆవశ్యకత గురించి చర్చించి సభ్యుల అనుమతి తీసుకున్నట్లు వివరించారు. సిబ్బంది పిల్లలకు స్కాలర్‌షిప్ దాదాపు రూ.8 లక్షలు, 2 లాప్‌టాప్‌లు అందజేసినట్లు తెలిపారు. త్వరలో విజయవాడ, రాజమహేంద్రవరం రామచంద్రపురంలో బ్రాంచిలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు ఎఫ్‌ఎస్‌డబ్ల్యుఎం కేటగిరీలో ఒకశాఖను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పైడా ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ పైడా కృష్ణప్రసాద్, ది గాయత్రీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వనమాల శ్రీనివాస్ ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు. కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శ్యామ్ కిషోర్, బ్యాంకు డైరెక్టర్లు, ఖాతాదారులు వాటాదారులు హాజరయ్యారు. అందరికీ సంస్థ జనరల్ మేనేజర్ ఎన్ఎన్.సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్

ప్రజాశక్తి -గాజువాక : పోరాటాలతోనే హక్కులు సాధించుకోగలమని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ అన్నారు. సిఐటియు గాజువాక జోన్ కమిటీ 10వ మహాసభ అక్కిరెడ్డిపాలెంలోని కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా సిఐటియు జెండాను ఆవిష్కరించారు. కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. మృతిచెందిన నాయకులు జి.సుబ్బారావు, పివైవి.రమణారావు, నాగేశ్వరరావు చిత్రపటాలకు జగన్, రాంబాబు, కిరీటం పూలమాలవేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. సభకు గొల్లపల్లి సుబ్బారావు వేదికగా నామకరణం చేశారు. అనంతరం జరిగిన సభలో జగన్ మాట్లాడుతూ, కార్మికుల పోట్లాడి విజయం సాధించిన సందర్భాలు చాలా ఉన్నాయన్నారు. వడ్లపూడి రైల్వే వ్యాగన్ కార్మికులు, మున్సిపల్ కార్మికులు పోరాటం చేసి హక్కులు సాధించుకున్న విషయాన్ని గుర్తుచేశారు. మోడీ ప్రభుత్వం కార్మికుల మధ్య ఐక్యత లేకుండా చేస్తుందన్నారు. దీన్ని మనం ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. పులిలా గర్జించే స్థాయికి కార్మికులు ఎదగాలన్నారు. మోడీ ప్రభుత్వ విధానాలకు పవన్, జగన్, చంద్రబాబు మద్దతు ఇస్తున్నారని, కార్మిక వర్గంపై దాడి పెరుగుతోందని చెప్పారు. 1923 సంవత్సరం నుంచి ఉన్న చట్టాలను మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌గా మార్చు చేసి కార్మికులను బానిసలుగా చూస్తుందన్నారు.

జోన్ నూతన కమిటీ సభ్యులతో సిఐటియు నాయకులు

రాష్ట్రంలో ఉన్న అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఉన్నా అది అమలు కావడం లేదన్నారు. కేరళ రాష్ట్రంలో 147 రకాల సంక్షేమ బోర్డులు ఉన్నాయని తెలిపారు. మన రాష్ట్రంలో పెట్టుబడిదారులే ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికవుతున్నారని, కేరళ రాష్ట్రంలో కార్మిక వర్గం నుంచి ప్రజా ప్రతినిధులు ఎన్నికవుతున్నారని తెలిపారు. గాజువాకలో లక్ష మంది వరకు కార్మికులు ఉన్నారని, వీరంతా ఒక తాటిపైకి వస్తే కార్మిక రాజ్యం వస్తుందన్నారు. వీరంతా ఒక మాటపై ఉంటే ఎమ్మెల్యే, ఎంపీ కార్మికుల మాట వినక తప్పదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు ఎం.జగ్గునాయుడు, ఎం.రాంబాబు, ఎ.లోకేష్, డి.రమణ, జి.అప్పారావు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సిఐటియు గాజువాక జోన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డి.రమణ, ప్రధాన కార్యదర్శిగా ఎల్.బంగారునాయుడు, కోశాధికారిగా ఎ.లోకేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా ఎం.రాంబాబు, ఎన్.రాజేంద్రప్రసాద్, కె.అవతారం, గొలగాని అప్పారావు, ఎస్.జగన్నాధరావు, ఎస్.శ్యామల, చిన్నమ్ములు, కె.సురేష్, ఉపాధ్యక్షులుగా కె.సుధీర్‌కుమార్, బి.శ్రీనివాసరావు, ఇ.తాతారావుతోపాటు కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

స్మార్ట్ మీటర్లపై ఉద్యమం

- వెంకటాపురంలో అధిక బిల్లుల మీటర్లు పరిశీలన
- విశాఖ నగరంలో ఇంటింటా స్టిక్కర్ల అతికింపు

స్మార్ట్‌మీటర్లు వద్దంటూ పెందుర్తిలో సిపిఎం ప్రచారం

మునగపాక : వ్యవసాయ కనెక్షన్లకు అమర్చిన అదానీ స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం వెంటనే తొలగించకుంటే భారీఎత్తున ఉద్యమం చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో స్మార్ట్‌మీటర్ల బిగింపుతో వేలల్లో విద్యుత్ బిల్లులు వచ్చిన వ్యవసాయ బోర్ల మీటర్లను రైతులతో కలిసి స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగింపుతో ఇక్కడి రైతులకు రూ.20వేలు నుంచి రూ.22 వేల వరకు విద్యుత్ బిల్లులు రావడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారన్నారు. ముందుముందు గృహవిద్యుత్ వినియోగదారులకూ స్మార్ట్‌మీటర్లతో ఇదే పరిస్థితి ఉత్పన్నమౌతుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రవేటీకరణ విధానాలు, విద్యుత్ సంస్కరణలకు తలొగ్గి, రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల భారాన్ని ఇప్పటికే రైతులపై పెట్టిందని మండిపడ్డారు. మీటరు బిగించడానికే ఒక్కో రైతు నుంచి రూ.13 వేలు వసూలుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. ఎన్నికలకు ముందు విపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించడమే కాకుండా, బిగిస్తే బద్దలు కొట్టాలని లోకేష్ పిలుపునిచ్చారని, ఇపుడు అదే పనిని కూటమి పాలకులు చేయడం దుర్మార్గమన్నారు..కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజలపై రూ 15435 కోట్లు విద్యుత్‌భారాలను మోపిందన్నారు. పెంచిన విద్యుత్‌ఛార్జీలను రద్దుచేయడంతోపాటు స్మార్ట్‌మీటర్లను తొలగించకుంటే ఆందోళన తీవ్రం చేయకతప్పదని హెచ్చరించారు.. కార్యక్రమంలో వెంకటాపురం మాజీ ఉపసర్పంచ్ గనిశెట్టి సత్యనారాయణ, కడియం కృష్ణ, గోవిందరావు, సుందరపు అప్పలరాజు, కే నీలకంఠ రావు, చిన్ని అప్పారావు, డి మహాలక్ష్మిరావు పాల్గొన్నారు.

రాంబిల్లి : అదానీ కంపెనీకి లాభాలను చేకూర్చి, ప్రజలపై విపరీతమైన భారాలను వేసే స్మార్ట్‌మీటర్ల బిగింపును ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శంకరరావు పిలుపునిచ్చారు. ఆదివారం రాంబిల్లిలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగాఆయనమాట్లాడుతూ, సర్దుబాటు పేరుతో ప్రజలపై కోట్లలో విద్యుత్ ఛార్జీల భారం వేసిన కూటమి ప్రభుత్వం, ఇపుడు ఇచ్చిన మాటను మరిచి స్మార్ట్‌మీటర్ల బిగింపుతో మరింత ఇబ్బందులు, కష్టాలకు గురిచేసేందుకు పూనుకుంటోందన్నారు. స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు వచ్చిన వారిని తరమికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి జి. దేముడు నాయుడు, చందక రామక్రిష్ణ, ఎస్ నారాయణ రావ్, రుతల రాంబాబు పాల్గొన్నారు.

32వ వార్డులో స్టిక్కర్లను అతికిస్తున్న స్థానికులు

విశాఖ కలెక్టరేట్ : స్మార్ట్ మీటర్లు వద్దంటూ జివిఎంసి 32వ వార్డులో సిపిఎం ఆధ్వర్యాన ఇంటింటికీ స్టిక్కర్లు అంటించారు. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వై.రాజు, కె.నర్సింగరావు, గణేష్ పాల్గొన్నారు.

కొమ్మాది : స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ జివిఎంసి 5వ వార్డు పరిధి ముత్యాలమ్మ కాలనీ, వివేకానందనగర్‌లో సిపిఎం ఆధ్వర్యాన ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సంపదను అదానీ గుత్త పెట్టుబడి దారి సంస్థకు దోచిపెట్టడానికి కూటమి ప్రభుత్వం విద్యుత్తును ప్రైవేట్ పరం చేస్తుందని సిపిఎం నాయకులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.అప్పలరాజు, జి.కుమారి, ఎన్.పూజిత, టి.అప్పలనరసింహ, ఎస్.రామప్పుడు, జి.కిరణ్, జి.విజయ్, డి.సదా తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : అదానీ స్మార్ట్ మీటర్లు వద్దు, పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి 97వ వార్డు పరిధి కామాక్షమ్మనగర్, కుమ్మరికాలనీ, గాంధీనగర్, వికలాంగుల కాలనీ, రైల్వే కాలనీ, ఉడా కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ, అదానీ ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించకుండా ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి.శంకరరావు, కె.అప్పలనాయుడు, ఈశ్వరరావు, ప్రభుదేవా, మహేష్, ఎం.రాజు, అన్నపూర్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో స్మార్ట్‌మీటర్లు వద్దంటూ నినదిస్తున్న నాయకులు

రాంబిల్లిలో స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

జివిఎంసి 94, 95, వార్డుల పరిధి జ్యోతి నగర్, చైతన్య నగర్ బంటా కాలనీ ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు బి.అనంతలక్ష్మి మాట్లాడారు. సిపిఎం నాయకులు బి.రమణి, జక్కన్న సత్యారావు, మధు, వెంకటలక్ష్మి, ఈశ్వరమ్మ, మంగ తదితరులు పాల్గొన్నారు.

మాధవధార : జివిఎంసి 56వ వార్డు పరిధి గోకుల్ నగర్, దుర్గానగర్, యాతపేట తోట వీధి ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ, గోడలపై పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా జివిఎంసి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో చట్ట సవరణకు పూనుకుందన్నారు. స్మార్ట్‌మీటర్లతో భారాలు పెరగనున్న నేపథ్యంలో వాటిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కంచరపాలెం జోన్ కార్యదర్శి బి.ఈశ్వరమ్మ, నాయకులు ఎస్.సోమేశ్వరరావు, పి.వెంకట్రావు, ఎం.ఈశ్వరరావు, ఒ.అప్పారావు, పి.రామారావు, బి.వరప్రసాద్, కె.రాంబాబు, ఎ.మోహనరావు, ఎ.రవి, ఎ.శ్రీను పాల్గొన్నారు.

కంచరపాలెంలో కరపత్రాలను పంచుతూ ప్రచారం

కరాటే పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న రవికుమార్

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లి అక్షర ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఫస్ట్ ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2025 కరాటే పోటీలను ఆదివారం పెందుర్తి నియోజకవర్గ వైసిపి నాయకులు గండి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువత ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులుకరాటే పోటీల్లో రాణించి వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడంతోపాటు తల్లిదండ్రులకు, దేశానికి పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు.

తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతోపాటు ఆటల్లోనూ ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో అక్షర విద్యాసంస్థల వ్యవస్థాపకులు బోకం అప్పారావు, సర్పంచ్ నెబర్తి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు యడ్ల నాయుడు, సిరపరపు వాసు, ఎస్ కనకరాజు, కరాటే మాస్టర్ బివి అప్పారావు, మాస్టర్లు జామి శ్రీను, సిరపరపు రమణ, క్రీడాకారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యాన ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో ఆదివారం ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్యశిబిరంలో న్యూరో వైద్య నిపుణులు డాక్టర్ సాయి సందీప్,డాక్టర్ డి సాంబమూర్తి, డాక్టర్ బి. మీనేంద్ర కుమార్ బిపి షుగర్ ప్రత్యేకంగా నరాలకు సంబంధించి రోగులను ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు ఇచ్చారు. వైద్య శిబిరానికి అనకాపల్లి పరిసర ప్రాంతాల నుంచి 150 మంది రోగులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆర్గనైజర్లు మాట్లాడుతూ 2016 నుండి ప్రతి రెండు నెలలకు ఒకసారి ప్రముఖ వైద్యులచే మెడికల్ క్యాంపు నిర్వహించి, రోగులకు రెండు నెలలకు సరిపడా మందులను రూ.200కే అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక ఆర్గనైజర్లు మల్ల చంద్రశేఖర్, కె శ్రీరామమూర్తి, డి. రాఘవరావు, జే.రమేష్‌బాబు, మల్ల అప్పలనాయుడు, కొణతాల రాంబాబు,కె త్రినాథ్, ఎస్. రాజు, బి.నూక అప్పారావు, బి.చిన చెంచయ్య పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి భవిష్య ఎంపిక

భవిష్య

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం గాయత్రి హైస్కూల్ విద్యార్థిని కోనా భవిష్య శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో ప్రవేశానికి అర్హత సాధించింది. పదోతరగతి పరీక్ష ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచిన భవిష్య ట్రిపుల్‌ఐటికి ఎంపిక పట్ల గాయత్రి పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

తహశీల్దార్‌గా సత్యనారాయణ

ప్రజాశక్తి -మునగపాక: మండల తహశీల్దార్‌గా పి.సత్యనారాయణ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. బుచ్చయ్యపేట మండల రీసర్వే డిటిగా పనిచేసిన సత్యనారాయణకు తహశీల్దార్‌గా ప్రమోషన్ కల్పించి, మునగపాక మండలంలో నియమించగా, ఆయన విధుల్లో చేరారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి తహశీల్దారుగా డిటి మురళీధర్ విధులు నిర్వహించారు.

ఉత్సాహంగా పోస్టల్ ప్రీమియర్ లీగ్

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆత్మీయతకు మరో పేరు ఇండియన్ పోస్టల్ డిపార్ట్మెంట్ అని దైట్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు.ఆదివారం దైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇండియన్ పోస్టల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో విశాఖపట్నం రీజియన్ పోస్టల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను రత్నాకర్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ ప్రతి ఏటా పోస్టల్ సిబ్బంది ఆటవిడుపుగా ఇటువంటి క్రీడాపోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. పోస్టల్ సిబ్బందితో పోటీతత్వం, ఉత్సాహంగా పనిచేసేందుకు ఇవి దోహదపడతాయన్నారు. తొలిమ్యాచ్‌లో విశాఖపట్నం, విజయనగరం జట్లు తలపడ్డాయి. విశాఖపట్నం, విజయనగరం, నర్సీపట్నం, శ్రీకాకుళం, విశాఖపట్నం మెయిల్ సర్వీస్ జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి.

ఆటగాళ్లను పరిచయం చేసుకుంటున్న దైట్ చైర్మన్ రత్నాకర్

రీజియన్ అధ్యక్షులు వైబి. పలానరావు ఆధ్వర్యంలో సి. శంకరరావు, ట్రైనర్, సత్యనారాయణ, ఉపేంద్ర పర్యవేక్షణలో జరిగిన పోటీల రిఫరీగా ఇన్‌స్టిట్యూట్ ఫిజికల్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు వ్యవహరించారు పోటీలకు గ్రౌండ్ సమకూర్చిన రత్నాకర్‌ను అభినందించి, సత్కరించారు. 100 మంది పోస్టల్ క్రీడాకారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని తామరబ్బ ప్రాథమిక పాఠశాలలో 'సెయిల్ ఆథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ - విశాఖ విభాగం' సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, రాజమండ్రి నగరాలలోని ప్రముఖ ఆసుపత్రుల్లోని గుండె, కిడ్నీ, నరాలు, దంతాలు, కళ్లు, చర్మ వ్యాధులు, మానసిక ఆరోగ్యం, శ్వాసకోశ సమస్యలు వంటి విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని, రోగులకు సేవలు అందించారు. శిబిరానికి వచ్చేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి ఉచిత బస్‌సౌకర్యం కల్పించడంతో పెద్దఎత్తున రోగులు వచ్చి మధుమేహం, బిపి, గర్భిణులు, చిన్నపిల్లలకు ఆరోగ్య పరీక్షలు వైద్యసేవలు పొందారు. శిబిరానికి వచ్చిన వారికి అల్పాహారం, మధ్యాహ్న భోజనంతోపాటు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. జిల్లా సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు, సెయిల్ సంస్థ సభ్యులు, బాబా సేవకులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ వద్దు

- 16న 'తహశీల్దార్‌కు చెప్పుకుందాం రండి' ఆందోళన
- బాధిత గ్రామాల్లో ప్రజా సంఘాల విస్తృత అవగాహన

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వెంకన్న, ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి- కె కోటపాడు : మండలం ఆర్లి, చింతపాలెం, గరుగుబిల్లి గుల్లేపల్లి గ్రామాల్లో సెజ్‌ల పేరుతో ప్రభుత్వం బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఈనెల 16న బుధవారం 'తహశీల్దార్‌కు చెప్పుకుందాం రండి' పేరుతో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న, గీత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి యర్రా దేముడు, సిఐటియు మండల కార్యదర్శి ఈర్లె నాయుడుబాబు అన్నారు. ఆదివారం బాధిత నాలుగు గ్రామాల్లో రైతులకు ముద్రించిన కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెజ్ నిర్మాణానికి కావలసిన 1012 ఎకరాలు భూమి ఆర్లి, చింతపాలెం, గరుగుబిల్లి రెవిన్యూ పరిధిలో ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈప్రాంతంలో అసైన్డ్, ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయని, అవి పేద రైతులు సాగులో ఉన్నట్లు గుర్తించిన ప్రభుత్వం ఆయా రైతులను భయపెట్టి భూములు కాజేయడానికి యత్నించడం దుర్మార్గమన్నారు. మాడుగుల నియోజకవర్గంలో అత్యధిక రిజర్వాయర్లు ఉన్నాయని, వాటి సాగునీటి ఆధారంగా వ్యవసాయానికి యోగ్యమైన ఆయకట్టు భూముల్లో పరిశ్రమలు పెట్టేందుకు యత్నించడం సరికాదన్నారు. వ్యవసాయానికి యోగ్యమైన పరిశ్రమలు పెట్టి వాటిని అభివృద్ధి చేయాలని కోరారు. ఇప్పటికే పరవాడ, అచ్యుతాపురం ప్రాంతాల్లో సెజ్‌లు, పరిశ్రమల ఏర్పాటుతో నిత్యం జరుగుతున్న ప్రమాదాలు, స్థానికులకు ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసపుచ్చిన వైనాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ఇష్టంలేని, ఆమోదయోగ్యం కాని బలవంతపు భూసేకరణ ఆపాలని కోరారు. ఈనెల 16 న బుధవారం తహశీల్దార్‌కు చెప్పుకుందాం రండి నిరసనలో నాలుగు గ్రామాల భూబాధితులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గంగునాయుడు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

ఎన్నికైన లయన్స్ క్లబ్ కార్యవర్గం

ప్రజాశక్తి చోడవరం : లయన్స్ క్లబ్ చోడవరం శాఖ నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా పసుమర్తి సాంబశివరావు, కార్యదర్శి బద్రిమహంతి పొల్లాజు, కోశాధికారి పనతల గంగాధర్, డాక్టర్ నీలం నాగేంద్రబాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వాణి బాబుచ కాండ్రేగుల డేవిడ్, డాక్టర్ పూసర్ల శకుంతలరావు, నల్లమిల్లి గనిరెడ్డి, ముక్కా రమేష్, ఉగ్గిన నాగబాబు, వేపాడ సత్యనారాయణ, ఎస్ఎస్ షాపింగ్ మాల్ శ్రీనివాసు, కటకం దీపక్, యన్ డాక్టర్ హరిబాబు, పసుమర్తి మల్లిక్, సిరిసొల్ల ఆది గణపతి నాయుడు ఎన్నికయ్యారు. వీరిని గారి అధ్యక్షతన లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అధికారి గోపాలరావు, ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, చోడవరం సిఐ అప్పలరాజు, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఒరుగంటి రాంబాబు అభినందించారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాల అడ్డగింత

గ్రావెల్ తవ్వకాలను అడ్డుకుంటున్న ఎస్ఐ దివ్య, పోలీసులు

ప్రజాశక్తి.- సబ్బవరం: మండలంలోని గాలిభీమవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 61లో మునగకొండ వుడా డెవలప్మెంట్ ప్లాట్‌లో అనుమతుల్లేకుండా అక్రమంగా గ్రావెల్ తవ్వకాలను స్థానిక పోలీసులు అడ్డుకున్నారు. వివరాలివి. గాలి భీమవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి, బంజర్ అమ్ములుపాలెం గ్రామానికి చెందిన మరో వ్యక్తి డెవలప్మెంట్ ప్లాట్‌లో అక్రమంగా గ్రావెల్‌ను తవ్వుతున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ దివ్య సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమతుల్లేకుండా గ్రావెల్ తవ్వుతుండడంతో అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వినా, తరలించినా చట్టరీత్యా నేరమన్నారు. అనుమతులు ఉంటే చూపించాలని వారిని ప్రశ్నించగా, లేవని చెప్పడంతో తవ్వకాలకు పాల్పొద్దని హెచ్చరించారు.కాగా ఇదే విషయమై స్థానికులెవరైనా అక్రమమని అడిగితే, అన్ని అనుమతులున్నాయని బుకాయిస్తూ గ్రావెల్ దందా నిర్వహిస్తున్న వారికి, పోలీసుల రంగప్రవేశంతో అడ్డుకట్ట పడింది.

యాత కులస్తులపై కూటమి చిన్నచూపు

సంఘీభావం ప్రకటిస్తున్న యాత కులస్తులు

ప్రజాశక్తి -అనకాపల్లి : ఉత్తరాంధ్ర యాత కులస్తులకు కీలక రాజకీయ పదవులు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం అవమానిస్తోందని యాత సంక్షేమ సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు పెంకే మరేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం అనకాపల్లి నాయుళ్ల వీధిలో జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ తరతరాలుగా యాత కులస్తులను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారనిరాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి పరిచే ఏ చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఉత్తరాంధ్రలో యాత కులస్తులు సభ్య సమాజానికి దూరంగా ఉంటున్నారని, అక్షరాస్యత శాతం తక్కువేనని,పేదరికం, దారిద్యం, నిరుద్యోగం పట్టి పీడిస్తున్నాయన్నారు. యాత కులస్తులకు రాజకీయ, సామాజిక రంగాలలో సముచిత స్థానం కల్పించాలని మరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తుర్తి అప్పారావు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో బిసి ఏలో 54 కులాల నుండి 32 కులాలను అత్యంత వెనకబడిన కులాలుగా గుర్తించి వారి జీవన విధానాన్ని మెరుగుపరుస్తామని జీవో నెంబర్ 17 జారీ చేశారని గుర్తు చేశారు. గత వైసిపి ప్రభుత్వం యాతలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వ ఆదుకోవాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో తెలంగాణలో మాదిరిగా ఏపీలోనూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలుపరిచి, అందులో ఎంబిసిలకు 15 శాతం కల్పించాలని కోరారు. సమావేశంలో క్రి వెంకటరమణ, బత్తిని సత్యనారాయణ, ఒడిసెల సూరిబాబు, కట్టా అప్పారావు, రాయుడు రమేష్, గేడి సంతోష్ ,ఎర్ర రాము మాట్లాడారు.

బండారును కలిసిన పిఎసిఎస్ చైర్మన్

పిఎసిఎస్ చైర్మన్, శాఫ్ డైరెక్టర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి -సబ్బవరం: మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తిని వెన్నెలపాలెంలోని ఆయన స్వగృహంలో ఆదివారం సబ్బవరం దుర్గాంబ పిఎసిఎస్ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గండి దేముడు బాబు, ఏపి క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) డైరెక్టర్ పిబివిఎస్ఎన్ బుచ్చిరాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారుకు పుష్పగుచ్ఛమిచ్చి, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కోరాడ శీను, కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ వల్లా తాతారావు, పోతల కనకరాజు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన అమర్

అప్పలనాయుడును పరామర్శిస్తున్న అమర్‌నాథ్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ, విశాఖలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని రాజాం గ్రామ మాజీ సర్పంచ్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు మరిసా అప్పలనాయుడును మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. అప్పలనాయుడు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అప్పలనాయుడు కుమారుడు ప్రస్తుతం రాజాం సర్పంచ్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడి నానిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

టిడిపి మండల అధ్యక్షునిగా సత్యనారాయణ

ఎంవివి.సత్యనారాయణ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండల టిడిపి అధ్యక్షునిగా మాజీ ఎంపిపి ఎంవివి సత్యనారాయణను ఎన్నుకున్నారు. ఆదివారం బుచ్చయ్యపేటలో మండల కార్యకర్తల సమావేశంలో పార్టీ పరిశీలకులు అడ్డిపల్లి జగ్గారావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా సత్యనారాయణ ఎన్నిక ఏకగ్రీవమైంది.టిడిపి కొత్త మండల అధ్యక్షుడు. సత్యనారాయణను విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టిడిపి నాయకులు తమరాన దాసు, దొంకిన అప్పలనాయుడు, తదితరులు సత్కరించి, చేసి అభినందనలు తెలిపారు

బెల్ట్ షాపులు తొలగించాలి

నేడు కలెక్టరేట్ వద్ద గీత కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- కె కోటపాడు: జిల్లాలో బెల్ట్ షాపులను తొలగించి కల్లు గీత కుటుంబాలను ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి యర్ర దేవుడు డిమాండ్ చేశారు. జిల్లాలో అనధికారికంగా నిర్వహిస్తున్న మూడు వేలకు పైగా బెల్ట్ షాపులను తొలగించి, ఎక్సైజ్ పాలసీని యథావిధిగా అమలు చేయాలన్నారు. కల్లుగీత వృత్తిలో ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు రూ.ఐదు లక్షలు, శాశ్వత వైకల్యానికి రూ.పదిలక్షలు, తాత్కాలిక వైకల్యానికి రూ.రెండు లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు.. గ్రామాల్లో బెల్ట్ షాపులు నియంత్రణకు విఆర్‌ఎ, సచివాలయ మహిళా పోలీస్, సర్పంచుతో గ్రామ కమిటీ ఏర్పాటు చేయాలని అన్నారు. బెల్ట్ షాపులున్న గ్రామపంచాయతీ సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గంట శ్రీరామ్ జిల్లా నాయకులు గోకాడ ఏమున్నాయుడు, ప్రజా సంఘాల జిల్లాకన్వీనర్, బత్తిన నాగేశ్వరరావు. కల్లు గీత సంఘం జిల్లా అధ్యక్షులు గండిబోయిన రాము, ఖండిపల్లి సహదేవుడు, శెట్టి రమణ, సమ్మెంగ మహాలక్ష్మి పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం



జూలై వాక్‌టాక్ ను ఆవిష్కరిస్తున్న వాకర్స్

ప్రజాశక్తి-.అనకాపల్లి : ప్రతి ఒక్కరిరూ నిత్యం నడకతో ఆరోగ్యం పొందవచ్చని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 1013 ప్రెసిడెంట్ టీవీ హనుమంతరావు అన్నారు. ఆదివారం కె ద్వారాకానాథ్ అధ్యక్షతన వివేకానంద ఫంక్షన్ హాల్‌లో వాకర్స్ కేబినెట్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ హనుమంతరావు, సీనియర్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎహెచ్ఎన్ వెంకటరావు పాల్గొని,వాకర్స్ క్లబ్స్ బలోపేతానికి తీసుకోవలసిన జాగ్రత్తలు, అభివృద్ధి పథకాలు వివరించారు.

ప్రస్తుత కాబినెట్ సెక్రెటరీ ఆర్ఆర్ఎస్ మహేష్ ఈ ఏడాది చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కొత్తగా ఎంజిఎఫ్ సభ్యులుగా చేరిన 40మందికి నియామక పత్రాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో డి.నాగేంద్ర, డాక్టర్ డిడి నాయుడు, కొణతాల జగన్నాధరావు నాయుడు, లక్ష్మణరావు, రాపేటి నారాయణ రావు, వై శివ, పాల్గొన్నారు. సభ్యులకు కుబేర్ డోనర్ కమల్ బైడ్ కానుకలను అందజేశారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఒకేషనల్ ఫిజియోథెరపీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఈనెల 15లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.శిరీషరాణి తెలిపారు. బిపిటిలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై అనుభవం కలిగి ఉన్న వారు ఈనెల 15 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోగా కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి -చోడవరం : చోడవరం కేశవస్వామి ఆలయంలో ఉపాలయంగా ఉన్న బలభద్ర సుభద్ర సమేత జగన్నాథ స్వామి రథోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం గుడిలో అన్నసమారాధన నిర్వహించారు. 1500మంది భక్తులు పాల్గొన్నారు,కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సుదర్శనం సీతారామాచార్యులు, తెలుగుదేశం నాయకులు, శివాలయం చైర్మన్ గూనూరు సురేష్, జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, బ్యాంకు రాము, కృష్ణారావు, తాతాజీ, కోనేటి రాజు, వీరభద్రరావు మాస్టారు, సుధాకర్, బుజ్జి, సత్యారావు, ప్రసాదరావు మాస్టారు, భూలక్ష్మి, వసంత, వందన, లక్ష్మి, సత్యమణి, ఉపాధ్యాయుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ నాశనం

- హోం మంత్రి అనిత
- పలు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు

మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి: వైసిపి ఐదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ నాశనమయ్యాయని రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఎస్.రాయవరం మండలం రామయ్యపట్నంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ముందుగా శ్రీకృష్ణ, రామాలయాలను దర్శించుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పార్టీలకతీతంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, ఎన్నికలు వరకే పార్టీలు-రాజకీయాలు అని అన్నారు. ఇప్పుడు ఎన్నికల సమయం కాదని, ప్రజల యోగక్షేమాలు తెలుసుకోవడానికే వచ్చానని చెప్పారు. ప్రజలు మంచి మెజారిటీతో తనను గెలిపించి మంత్రిగా చేశారని దీంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. గత ఐదు సంవత్సరాల్లో అన్ని వ్యవస్థలను నాశనం చేశారని, కష్టాలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రారంభమవుతుందని, త్వరలో ప్రభుత్వం నిరుద్యోగ భృతి అందించనున్నట్టు తెలిపారు. రామయ్యపట్నంలో సర్పంచ్ తీర్మానాలు ఇవ్వకపోవడంతో గ్రామం అభివృద్ధిలో వెనుకంజలో ఉందని, గ్రామ అభివృద్ధికి అందరూ కలిసి ముందుకు రావాలని, తను పూర్తిగా సహకరిస్తానని తెలియజేశారు. పాయకరావుపేట నియోజకవర్గంలో టాయ్ పరిశ్రమ వస్తే 25 వేల మంది మహిళలకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్క్ లాంటి పరిశ్రమలతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, వినోద్ రాజు, నక్కపల్లి పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

మాడుగుల: ఏడాది కూటమి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామని శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆదివారం మండలంలో ఎం.కోటపాడు గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో ప్రతి గ్రామంలో పంచాయతీ ఎన్నికల్లో కూటమి జెండా ఎగిరేలా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు, క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్, గ్రామ శాఖ అధ్యక్షులు పిల్ల గంగునాయుడు, కో-ఆపరేటివ్ అధ్యక్షులు పిల్ల నాయుడు, వడ్డే రాజ్ కుమార్, మజ్జి తాతబాబు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

కోటవురట్ల: కూటమి ప్రభుత్వం సుపరిపాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలో కైలాస పట్నం గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షులు మాణిక్యాలరావు ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామంలో గ్రామస్తులకు వివరించారు, సామాజిక భద్రతా పింఛన్లు తల్లికి వందనం, ఏడాదికి మూడు సిలిండర్లు త్వరలో అందజేయనున్న అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణంపై వివరించారు.

తీవ్ర అనారోగ్యంలోనూ ఉత్సాహంగా...

అచ్యుతాపురం : రెండు కిడ్నీలు దెబ్బతిని,వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్న తీవ్ర అనారోగ్య పరిస్థితులు, కన్ను, ముఖంపై గాయాలతో రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని, కేడర్‌లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలను పాటిస్తూ, ఆదివారం హరిపాలెంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొలమర శెట్టి, పోలమర శెట్టి కిరణ్‌లకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1, 79,000 చెక్కును అందజేశారు రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు.

భీమునిపట్నం : జివిఎంసి 3వ వార్డు పరిధి గొల్లలపాలెంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు గొలగాని నరేంద్ర కుమార్, నాయకులు కనకల అప్పలనాయుడు, కె.కామేష్ పాల్గొన్నారు.

శరవేగంగా ఎంపిడిఒ కార్యాలయ భవనం పనులు

ప్రజాశక్తి: రావికమతం: మండల పరిషత్తు రెండవ అంతస్తు భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇదివరకే మొదటి అంతస్తు పనులను పూర్తి చేసుకుని అధికారులు విధులను నిర్వహిస్తున్నారు. మొదటి అంతస్తు భవనంలో మండల పరిషత్ అధ్యక్షులు, ఎంపీడీవో, ఈవోపీఆర్డి, ఏఇ పిఆర్ లకు వేరువేరు గదులు కేటాయించగా, మెయిన్ హాలులో ఏవో, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టులు విధులు నిర్వహిస్తున్నారు.

రెండవ అంతస్తు భవన నిర్మాణం పూర్తయితే సభలు, సమావేశాలు, మిగిలిన అధికారులకు, గదులను కేటాయించవచ్చునని, మండల పరిషత్తు వర్గాలు తెలుపుతున్నాయి. 2005లో మండల పరిషత్తు నూతన భవన నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి భూమి పూజ చేసి నిధులను కేటాయించారు. ఆ నిధులతో నిర్మాణ పనులు చేపట్టగా అప్పుడు కేటాయించిన నిధులు చాలక పోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుత ఎంపీపీ పైల రాజు, పాలకవర్గ సభ్యుల సహకారంతో మండల పరిషత్తు నిధులను కేటాయించి మొదటి ఫ్లోర్ భవన నిర్మాణం పూర్తి చేసుకొని, రెండవ అంతస్తు నిర్మాణం కూడా మండల పరిషత్ నిధులతో పూర్తి చేసుకోవడానికి సిద్ధంగా ఉంది. మండల పరిషత్తు భవన ఆవరణలో ఉన్న మండల విద్యాశాఖ, వెలుగు, ఎన్ఆర్ఈజీఎస్, సివిల్ సప్లై గోడౌన్, భవిత, ఆర్‌బ్ల్యూఎస్ అధికారి భవనాలు ఉన్నాయి. వీటి రక్షణకు ప్రహరీ మరమ్మతులతోపాటు నూతన గేట్లను కూడా అమర్చారు.

నిర్మాణంలో ఉన్న రెండవ అంతస్తు భవనం

నిర్లక్ష్యంతో.. సాగునీరు దూరం

- -పంటకాలువల్లో పేరుకుపోయిన పూడిక
- -మరమ్మతుకు నోచని గబ్బాడ ఆనకట్ట గేట్లు

కాలువలో పేరుకు పోయిన పూడిక

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: పంటలు పండాలంటే ప్రతి సంవత్సరం వ్యవసాయ కాలువ పనులు జరగాల్సి ఉంది. ఈ సంవత్సరం పంట కాలవలో పూడిక తీయడం, పంట కాలువలను మరమ్మతులు చేయడం వంటి పనులు అసంపూర్తిగా జరుగుతున్నాయి. పంట కాలువలు పూడిక, తుప్పలు పేరు పోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. నేటికీ పనులు పూర్తి కాకపోవడంతో ఆయకట్టుదారులు ఈ సంవత్సరం పంటలు పండుతాయో లేదో అనే అనుమానంతో రైతులు దిగాలుగా ఎదురు చూస్తున్నారు.

రావణాపల్లి జలాశయం కింద నర్సీపట్నం, గొలుగొండ మండలాల్లో 2,600 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టు దారులకు నీరందే పరిస్థితి కనిపించడం లేదు. ఇక్కడ నుండి నీరు కాలువల ద్వారా పొలాలకు చేరుతుంది. ఈ కాలువలులో పూడిక విపరీతంగా పేరుకుపోయి నీరు పారేందుకు దారి లేదు. కాలువలకు గండి పడి నీరు వృథాగా పోతుండటంపై గత సంవత్సరం స్పీకర్ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఈ సంవత్సరం గండ్లు పూడ్చేందుకు సుమారు 10లక్షలు రూపాయలు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కేటాయించారు. గబ్బాడ నుండి బలిఘట్టం వరకు కాలువ పనులు కొంతమేరకు మాత్రమే జరిగాయి. గబ్బాడ ఆనకట్ట గేట్లు పాడై ఐదేళ్లు కావస్తోంది. ఏజెన్సీలో వానలు ఎక్కువగా పడితే రావణాపల్లి జలాశయం నీటిమట్టం గరిష్టానికి చేరుకుంటుంది. కొంత నీరు పొర్లుకట్టు మీదుగా గబ్బాడ ఆనకట్ట వద్దకు చేరుతుంది. అక్కడి నుంచి కాలువలకు మళ్లిస్తుంటారు. జలాశయ నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకున్నప్పుడు అదనపు నీరు పొర్లుకట్ల మీదుగా గబ్బాడ ఆనకట్టకు చేరుతుంది. ఇక్కడి నుంచి కాలువలకు మళ్లించాలి. గేట్లు సరిగా లేక కొంత నీరు ఏటిపాలవుతోంది. ఈ గేట్లు మరమ్మతుకు రూ. 4 లక్షలు మంజూరయ్యాయి. కానీ ఇంజనీరింగ్ అధికారులు ఈ గేట్లు పర్యవేక్షణ చేసి రిపేర్ చేయాలి. గేట్లు మరమత్తులు నేటికీ కొనసాగలేదు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ప్రాంతంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని రైతులు విమర్శలు చేస్తున్నారు.

ఈ విషయమై జల వనరుల శాఖ ఈఈ వి.బాల సూర్యంను వివరణ కోరగా త్వరలో పనులు ప్రారంభమవుతాయని, పూడికలు తీత, గేట్లు మరమ్మతులకు ఇంజనీరింగ్ అధికారులు రావాల్సి ఉంది. దీని గురించి ఇప్పటికే నివేదిక ఇచ్చామని ఆయన తెలిపారు.

గబ్బాడ ఆనకట్ట వద్ద వృథాగా పోతున్న నీరు

పిఎసిఎస్ చైర్మన్ల నియామకం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: కూటమి ప్రభుత్వం పిఎసిఎస్ చైర్మన్‌లను నియమించింది. నర్సీపట్నం నియోజకవర్గంలో చైర్మన్ లు, డైరెక్టర్ల వివరాలను విడుదల చేశారు. వేములపూడి చైర్మన్‌గా బొలెం రాంప్రసాద్, నర్సీపట్నం రుత్తల కృష్ణ, చెట్టుపల్లి అప్పికొండి రాజారావు, శృంగవరం సింగంపల్లి సన్యాసి దేవుడు, నాతవరం ఆపిరెడ్డి మహాలక్ష్మి, పీకే గూడెం అంకంరెడ్డి సన్యాసయ్య, మాకవరపాలెం సిరంరెడ్డి వెంకట నాగ చినబాబు, చీడి గుమ్మల కామిరెడ్డి శ్రీరామ్మూర్తి, చోద్యం చిటికెల సాంబమూర్తిలను నియమించినట్లు కోపరేటివ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు అందరికీ త్వరలోనే నియామక ఉత్తర్వు కాపీలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి సొసైటీ కి ఇద్దరు డైరెక్టర్లు చొప్పున నియమించారు.

15న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో ఈనెల 15వ తేదీన స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో హెూం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారని వెల్లడించారు. దాదాపు 15 ప్రముఖ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొనబోతున్నాయని, ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యస్ రాయవరం మండల పార్టీ అధ్యక్షులు అమలంకంటి అబద్ధం, కోటవురట్ల మండల పార్టీ అధ్యక్షులు లింగనాయుడు, నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణరావు, పాయకరావుపేట మండల పార్టీ అధ్యక్షులు చించలపు పద్దు, పాయకరావుపేట టౌన్ పార్టీ అధ్యక్షులు వరహాలు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్న

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పట్టణంలో గో హాస్పిటల్స్, ఆశ్రిత కంచర్లపల్లి బృందం సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. ఈ మెడికల్ క్యాంప్‌ను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, సతీమణి కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ప్రారంభించారు. గో హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సువర్ణ నేతృత్వంలో అమెరికాలో సేవలందిస్తున్న డాక్టర్ ఆశ్రిత కంచర్లపల్లి బృందం ఉచిత మందులు, విటమిన్ మాత్రలు, కళ్లద్దాలు, ఇతర సాధారణ ఔషధాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, గో హాస్పిటల్స్ ప్రత్యేక శిబిరం నిర్వహించడాన్ని హర్షించతగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకాయల రాజేష్, టిడిపి వార్డ్ కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయానికి భక్తుల తాకిడి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో రేభాక గ్రామంలో గూడుపమ్మ తల్లి ఆలయంలో భక్తులు పోటెత్తారు. ఆషాడ మాసం ఆదివారం నాడు పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. పలువురు కుటుంబ సభ్యులతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని, అక్కడే వంట చేసుకుని భోజనాలు చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణం భక్తుల తాకిడితో కిటకిటలాడింది.

భోజనాలు చేస్తున్న భక్తులు

కథలను చెబుతున్న ఎంఇఒ

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయధికారిణి పి.దమయంతి ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు నాతవరం మండల విద్యాశాఖాధికారి వరహాలబాబు ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఆయన విద్యార్థులతో ముచ్చటిస్తూ గ్రంథాలయం ప్రాముఖ్యతను వివరించారు. కాలం వృధా చేయకుండా పుస్తకాలను అభ్యసించి మంచి జ్ఞానాన్ని పొందాలని కోరారు. విద్యార్థుల అడిగిన ప్రశ్నలకు సమాదానాలు ఇచ్చారు.

మట్టి ట్రాక్టర్లు, జెసిబి స్వాధీనం

ప్రజాశక్తి -కోటవురట్ల: అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్ తెలిపారు. ఆదివారం గొట్టువాడ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను, ఒక జెసిబిని స్వాధీనం చేసుకుని స్టేషన్కు తరలించారు, తహసిల్దార్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు.

పట్టుబడ్డ ట్రాక్టర్

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

సంజీవిని ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-రావికమతం:గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావడం ఎంతో శుభ పరిణామమని చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సంజీవిని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రినీ ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల కేంద్రానికి చుట్టు పక్కల ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజలందరికీ ఈ ఆసుపత్రి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. వైద్యులు కిరణ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మండలంలో ప్రతి గ్రామంలోనూ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజనకొండ నాయుడు, రావికమతం సర్పంచ్ మోది నాయుడు, ఎంపీటీసీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి :నక్కపల్లి హోంమంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద ఆదివారం మండలంలో కాగిత గ్రామానికి చెందిన దేవవరపు గోవింద రావుకు రూ. 12,43,188 ల సీఎం సహాయనిధి చెక్కును హోం మంత్రి వంగలపూడి అనిత అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోనేందుకే సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి అనిత అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న మంత్రి అనిత

ఆకాశం వైపు..అన్నదాత చూపు

-ఆదిలోనే కొనవాడిపోతున్న వరి నారు-తడి పెట్టేందుకు రైతన్నల తిప్పలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ కు సంబంధించి మండలంలో 4850 ఎకరాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 920 క్వింటాలు వరి విత్తనాలను వివిధ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచగా, ఇప్పుడు వరకు 750 క్వింటాలు వరి విత్తనాలను రైతులు తీసుకువెళ్లారు. ఈనెల ఒకటి, రెండు తేదీల్లో వర్షం కురవడంతో, సిద్ధంగా ఉంచిన వరి నారు మడిలో వరి విత్తనాలను జల్లారు. పది రోజుల నుండి వర్షాలు కురవక పోవడంతో రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. గత నాలుగైదు రోజుల నుండి ఎండ తీవ్రత పెరగడంతో నారుమడిలో ఉన్న తేమ ఎండి పోవడంతో విత్తనాలు మొలకెత్తలేదు. అక్కడక్కడ బావులు, నీటి సదుపాయం ఉన్న రైతులు నారుమడులకు నీటి తడిని పెట్టి వాటిని కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. నీటి సౌకర్యం లేని రైతులు చినుకు కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. శనివారం సాయంత్రం ఆకాశంలో నల్లటి మేఘాలు కమ్ముకోవడంతో వర్షం పడుతుందని రైతులు ఎంతో ఆశతో ఎదురు చూసినప్పటికీ చిరుజల్లులతో సరిపెట్టు కోవడంతో రైతులు నిరాశ చెందారు. ఆదివారం కూడా వర్షం పడుతుందని ఎదురు చూసినప్పటికీ ఫలితం కనిపించలేదు. భానుడు భగభగ మండిపోవడంతో వరి విత్తనాలు మొలకెత్తడం లేదు. దీంతో రైతులు దిగులు చెందుతున్నారు.

నక్కపల్లిలో ఎండుతున్న వరి విత్తనాల మడి

బుచ్చయ్యపేట మండలం చినఅప్పన్నపాలెంలో పైపులతో తడుపుతున్న రైతులు

పైపులతో నారుమళ్లకు తడి

బుచ్చయ్యపేట : ఖరీఫ్ ఆదిలోనే ప్రతికూల వర్షాలు, వాతావరణ పరిస్థితులు అన్నదాతలను కలవర పరస్తున్నాయి. సీజన్‌లో ముందస్తుగానే పలకరించిన నైరుతిపవనాలు ముఖం చాటేయడంతో కొన్నాళ్లుగా చినుకురాలని పరిస్థితి నెలకొంది.అంతేకాక మండు వేసవిని తలపించేలా మండుతున్న ఎండలు అన్నదాతలకు కంటిమీద కునుకులేకుండా చేసున్నాయి.

వారం, పదిరోజుల క్రితం వరినారుమళ్లలో చల్లిన విత్తనాలు మొలక దశలో ఉండగా, చినుకురాలక, ఎండలు మండుతుండడంతో కొనవాడిపోతున్నాయని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. దీంతో కలవరానికి గురైన అన్నదాతలు అందుబాటులో ఉన్న వ్యవసాయబోర్లు, నీటి వనరుల నుంచి మోటార్ల ద్వారా సాగునీటిని వాడిపోతున్న పైపులతో వరినారుకు తడిపెడుతున్నారు. సాగునీరు అందుబాటులో లేని కొన్ని చోట్ల బిందెలతో నీరు మోసి, వరి నారును తడుపుతున్నారు. మండలంలోని. బుచ్చయ్యపేట, చిన్నప్పన్నపాలెం దిబ్బిడి, పోలేపల్లి, వడ్డాది, విజయరామరాజుపేట తదితర గ్రామాల్లో నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో అన్నదాతలు ఆందోళనకు గురౌతున్నారు.

క్వారీ లీజులు రద్దు చేయకుంటే ఉద్యమం

-కెవిపిఎస్ నేతల డిమాండ్

ప్రజాశక్తి- కోటవురట్ల: క్వారీ లీజులు రద్దు చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కెవిపిఎస్ నేతలు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు సమావేశంలో మాటాడారు. మాకవర పాలెం మండలం కోడూరు గ్రామంలో 33 కుటుంబాలు గత 50 సంవత్సరాలు పై నుండి జీడి మామిడి తోటలో వేసుకొని జీవనోపాధి సాగిస్తున్నారన్నారు. పిల్లలు స్కూలు ఫీజులు, కుటుంబంలో ఇతర ఏ అవసారలైనా ఆ జీడి మామిడి తోట మీదే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. అటువంటి తోటల్లో మైనింగ్‌కు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం, అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కోడూరు దళితులు అనేకసార్లు దరఖాస్తులు ఇచ్చినా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వారం రోజుల నుంచి జీడి తోటలో పాకేసుకొని క్వారీ లీజులు రద్దు చేయాలని శాంతియుతంగా నిరసన తెలియజేస్తూ ఉంటే పాక తొలగించారన్నారు. ఆ పాకను తొలగించిన వారిపై తక్షణమే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు.తక్షణమే క్వారీలు రద్దు చేయాలన్నారు. క్వారీలతో జీడి మామిడి తోటలో దుమ్ముతో పంట చేతికి రాలేదని, నాశనం అయిపోతున్నాయని తెలిపారు. క్వారీలతో వాటర్ కూడా కలుషిత అవుతుందని, వాటర్ తాగితే కిడ్నీ సమస్యలు, కీళ్ల నొప్పులు వంటి సమస్యలు వస్తాయని అన్నారు. తోటల యజమానులకు ఇష్టం లేకుండా మైనింగ్ చేయాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, తక్షణమే క్వారీ లీజులు రద్దు చేయాలన్నారు. చేయకపోతే జిల్లా వ్యాప్తంగా కార్మిక ప్రజా సంఘాలతో కలిపి ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదిక సంక్యలో మహిళలు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజలపక్షం
కావలెను
ప్రతిష్ఠాత్మక దినపత్రిక ప్రజాశక్తికి ఈ కింది కేంద్రాల్లో విలేకర్లు కావాలి.
అభ్యర్థులకు తెలుగులో రాయగల రచనా సామర్థ్యం, రాయాలనే ఆసక్తి, సామాజిక స్పృహ ఉండాలి

విశాఖపట్నం జిల్లా		అనకాపల్లి జిల్లా
సింహాచలం	కూర్మన్నపాలెం	మాకవరపాలెం
సింధియా	సిరిపురం	యలమంచిలి రూరల్
మద్దిలపాలెం	కంచరపాలెం	ఎస్.రాయవరం

ఉద్యోగ అవకాశాలు
అనకాపల్లి జిల్లా కేంద్రం విలేకరి
ఎడివిటి గాజువాక జోన్ ఇన్‌ఛార్జి
జాబ్‌వర్క్ ఎగ్జిక్యూటివ్
అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత
ఇంటర్వ్యూ : తేది : 18-07-2025 శుక్రవారం ఉదయం 10 గంల నుండి
అడ్రస్ : ప్రజాశక్తి కార్యాలయం,
ప్లాట్ నెం.3 'జి' బ్లాక్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఆటోనగర్, విశాఖపట్నం-46
సెల్ : 9491570765, 9490099125